సాక్షి
మంచిర్యాల
మంగళవారం : 31 : జనవరి : 2023

ఆదాయం రూ.21.37లక్షలు



ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయ జాతర హుండీని ఐటీడీఏ అధికారులు, మెస్రం వంశీయులు లెక్కించారు. రూ.21.37 లక్షల ఆదాయం సమకూరింది. 10లో▸



దిందా.. జగమెరిగేలా

గ్రామీణ జీవన విధానం వెండితెరకు ఎక్కనుంది. 1994లో జరిగిన ఘటనల ఆధారంగా యువ దర్శకుడు చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్థానికులకు అవకాశం కల్పించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా గాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

బల్దియాల్లో అసంతృప్తి !

- మున్సిపల్ పాలకవర్గాల్లో విభేదాలు
- నస్పూర్‌లో బయటపడ్డ కుమ్ములాటలు
- చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్ల మధ్య సాగని సఖ్యత
- పలు చోట్ల సొంత పార్టీలోనే వర్గాలు
- పట్టించుకోవడం లేదనే వాదనలు



నస్పూర్ మున్సిపల్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలోని మున్సిపల్ పాలకవర్గాల్లో అంతర్గత కుమ్ములాట మొదలైంది. మూడేళ్ల పదవీ కాలం ముగిసిన వెంటనే ఇన్నాళ్లు తమ లోపల ఉన్న అసంతృప్తి బయటపడుతోంది. తాజాగా నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్‌పై అక్కడి కౌన్సిలర్లు అవిశ్వాసానికి పావులు కదిపారు. ఎమ్మెల్యే వారిని బుజ్జగించడంతో ఆ అసంతృప్తి అవిశ్వాసం వరకు వెళ్లలేదు. ఈ బుజ్జగింపు ఎంత కాలం వరకు కొనసాగుతుందో చెప్పలేని పరిస్థితి. అవిశ్వాసం ప్రవేశపెడితే చైర్‌పర్సన్‌గా ఎవరిని ముందుంచాలనే సమస్యతోనూ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. చట్ట ప్రకారం పురపాలక సంఘాల్లో మూడేళ్లు పూర్తయిన తర్వాత చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టవచ్చు. ముందస్తు నోటీసుతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మెజార్టీ సభ్యుల ఆమోదంతో కొత్తవారిని ఎన్నుకునే అవకాశం ఉంటుంది. సమయం రాగానే కొందరు తమ అసమ్మతి రాగం బయటకు వినిపిస్తున్నారు. దీంతో చైర్మన్లు ఇరుకున పడుతున్నారు. మరోవైపు పట్టణాల్లో అభివృద్ధికి ఆటంకం ఏర్పడనుంది. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ పట్టణ పౌరుల్లోనూ చులకన భావం ఏర్పడే పరిస్థితి వస్తోంది. ఈ వివాదాలు పట్టణ ప్రజల సమస్యలు తీర్చడంలో ఆటంకంగా మారుతున్నాయి.

తమను పట్టించుకోవడం లేదనే

జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు ఉన్నాయి. మందమర్రి మున్సిపల్‌కు ఏజెన్సీ వివాదం కేసుతో ఎన్నికలు నిర్వహించడం లేదు. మిగతా జిల్లా కేంద్రమైన మంచిర్యాల, బెల్లంపల్లితోపాటు కొత్తగా ఏర్పడిన లక్సెట్టిపేట, నస్పూర్, చెన్నూరు, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లోనూ నేతల మధ్య సఖ్యత లేకుండా పోతోంది.

- క్యాతనపల్లిలో మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి సర్పంచ్‌గా ఉన్న ఓ కౌన్సిలర్ అవకాశం దొరికితే చైర్మన్ కుర్చీలో కూర్చోవాలనే ఆరాటంలో ఉన్నారు.
- బెల్లంపల్లి పట్టణంలో అక్రమ కట్టడాలు, నిర్మాణాలు, ఇతరత్రా వాటిలో తమకు ఏం 'అందడం' లేదనే ఆవేదనతో లో లోపల కొందరు కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారు.
- తాజాగా నస్పూర్‌లో బయటపడిన వివాదం పరిశీలిస్తే, ఇక్కడ పాలకవర్గం మొదటి నుంచి రెండు వర్గాలుగా చీలి ఉంది. ఇక్కడ మున్సిపల్ ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి ఓటమి పాలడంతో పరిస్థితులు మారిపోయాయి. దీంతో ఇప్పుడున్న చైర్మన్, వైస్ చైర్మన్ మధ్య వర్గపోరు సాగుతోంది. వైస్ చైర్మన్ ఐదేళ్ల కాలానికి రెండున్నర ఏళ్లకు ఒప్పందం ఉంది. చైర్మన్, వైస్ చైర్మన్ అయ్యేందుకు రూ.లక్షలు ఖర్చు చేశామంటూ బాహాటంగానే చెప్పుకుంటూ అసంతృప్తి వెల్లగక్కుతున్నారు.
- లక్సెట్టిపేట, చెన్నూరులో కొత్త పాలకవర్గాల్లో అసమ్మతి ఉన్నప్పటికీ బయట పడేంతగా కనిపించడం లేదు. చైర్మన్ పదవుల కోసం రూ.లక్షలు ఖర్చు చేసిన వారంతా అవినీతి, అక్రమాలు, భూ దందాలు, కమీషన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రియల్ వ్యాపారం, తమకు అనుకూలంగా కౌన్సిల్ తీర్మానాలు చేయించుకోవడం, తదితర వాటిపై కొందరు కౌన్సిలర్లు తమను పట్టించుకోవడం లేదనే భావనలో ఉన్నారు.

ఎమ్మెల్యేల గీత దాటుతారా?

బయటికి అసంతృప్తి వెల్లగక్కుతున్న కౌన్సిలర్లు స్థానిక ఎమ్మెల్యేలు గీసిన గీత దాటి సొంత పార్టీ నేతపైనే అవిశ్వాసం పెడతారా? అనేది పెద్ద ప్రశ్నగా మారింది. ఎందుకంటే వారి రాజకీయ భవిష్యత్ మొత్తం ఎమ్మెల్యేల చేతిలో ఉంటుంది. దీంతో పార్టీలో అంతర్గత విభేదాలు తెచ్చి, ప్రస్తుత పాలకవర్గాలపై అవిశ్వాసం పెట్టే సాహసం చేస్తారా? అనేది తేలాల్సి ఉంది. ఇప్పటికైతే ఎక్కడా కౌన్సిలర్లు స్థానిక ప్రజాప్రతినిధుల మాట దాటడం లేదు. స్వతంత్రంగా గెలిచిన కొందరు కౌన్సిలర్లు కూడా చాలా చోట్ల అధికార పార్టీకి అనుకూలంగానే కొనసాగుతున్నారు. చెన్నూరు నియోజవర్గ పరిధిలో చెన్నూరు, క్యాతనపల్లిలో ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాలు ధిక్కరించే అవకాశమే లేదు. ఇక బెల్లంపల్లిలోనూ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యదే అంతిమ నిర్ణయంగా ఉంటుంది. మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేటలో ఎమ్మెల్యే దివాకర్‌రావు కౌన్సిలర్ల పట్ల కొంత చూసీచూడనట్లు వ్యవహరించడంతో నస్పూర్‌లో ఈ మాత్రం అసంతృప్తి బయటపడినట్లుగా చెబుతున్నారు. చివరకు ఎమ్మెల్యే అసంతృప్తులను పిలిపించుకుని నచ్చజెప్పడంతో అవిశ్వాస ఆలోచన మార్చుకున్నారు. సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశాన్ని సొంత పార్టీ కౌన్సిలర్లే బహిష్కరించి, పలు ఆరోపణలు చేశారు.

సమావేశం రసాభాస

- బయటపడ్డ చైర్మన్, వైస్‌చైర్మన్ విబేధాలు
- మధ్యలోనే వెళ్లిపోయిన వైస్ చైర్మన్, కౌన్సిలర్లు



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్

నస్పూర్: నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్ మధ్య ఉన్న విభేదాలు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో బయటపడ్డాయి. చైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎజెండాలో పొందుపర్చిన 24 అంశాలపై చర్చ చేపట్టారు. చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ వైస్‌చైర్మన్ తోట శ్రీనివాస్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మడిగ మల్లయ్య, బౌతు లక్ష్మి, పూదరి కుమార్‌లు సమావేశానికి బహిష్కరించి మధ్యలోనే బయటకు వెళ్లారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు సురిమిల్ల వేణు, బాండారి సంధ్యారాణి, బొద్దున సంధ్యారాణి, శీపతి సుమతి, గెల్లు రజిత, బీజేపీ కౌన్సిలర్ అగల్‌డ్యూటి రాజు పలు అభివృద్ధి పనుల విషయంలో చైర్మన్, కమిషనర్‌లతో వాగ్వాదానికి దిగారు. సమావేశం నుంచి బయటకు వచ్చారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు ఎజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న చైర్మన్

– మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్

అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా కొందరి వార్డుల్లోనే కేటాయిస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్ ఆరోపించారు. సమావేశాన్ని బహిష్కరణ అనంతరం ముగ్గురు కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చైర్మన్ ఒంటెత్తు పోకడలను భరించలేకనే సమావేశాన్ని బహిష్కరించామని అన్నారు. హరితహారం నర్సరీలో పెంచుతున్న మొక్కల కొనుగోలు, మట్టి, ఎరువులు, తదితరాల కోసం కేటాయించిన నిధుల్లో రూ.14లక్షలు అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రాబోయే రోజుల్లో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు

– కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు

పట్టణంలో అక్రమ వెంచర్ల యజమానులపై చర్యలు తీసుకోకుండా చైర్మన్, కమిషనర్‌లు వారికి అండగా నిలుస్తున్నారని కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కౌన్సిలర్లతో విలేకరులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ అనుమతి, ఇంటి నంబర్ల కేటాయింపులకు డబ్బులు వసూలు చేస్తూ అమాయక ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తుల అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్ డబ్బులు ఇవ్వనిదే ఏ పనీ చేయడం లేదని బీజేపీ కౌన్సిలర్ అగల్‌డ్యూటి రాజు ఆరోపించారు. ఒక్క రోజులోనే 15 వెంచర్లకు అనుమతులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.

ఆరోపణలు అన్నీ అవాస్తవం..

– మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్

వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, పలువురు కౌన్సిల్ సభ్యులు, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు తనపై చేస్తున్న ఆరోపణలు అన్నీ అవాస్తవం, నిరాధారమైనవి అని చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ అన్నారు. చైర్మన్ తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. తనకు అన్ని వార్డులు సమానమేనని, నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి తోడ్పడుతున్నానని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పార్టీలో చర్చించాలని, ఇలా ప్రవర్తిస్తూ తోటి సభ్యులు, పట్టణ ప్రజలను అయోమయానికి గురి చేయవద్దని కోరారు. ఈ రోజు జరిగిన ఘటనను పార్టీ అధ్యక్షుడు బాల్క సుమన్, ఎమ్మెల్యే దివాకర్‌రావు దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

స్థాయీ కమిటీ సమావేశాలకు డుమ్మా

- ఏడింటిలో మూడింటికి ప్రజాప్రతినిధుల హాజరు
- నాలుగింటిని వాయిదా వేసిన జెడ్పీ చైర్‌పర్సన్



మౌనం పాటిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, అధికారులు

మంచిర్యాలటౌన్: జెడ్పీ స్థాయీ కమిటీ సమావేశాలకు ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సమావేశాలు నిర్వహించగా.. ఏడు అంశాలకు గాను మూడింటికే హాజరయ్యారు. గ్రామీణాభివృద్ధి సాంఘిక సంక్షేమం, నిర్మాణ పనులు, ప్రణాళిక, ఆర్థిక పనుల అంశాలను వాయిదా వేశారు. వ్యవసాయం, విద్య, వైద్య సేవలు, మహిళా సంక్షేమంపై చర్చించారు. సమావేశానికి ముందు స్వాతంత్య్ర అమరవీరుల జ్ఞాపకార్థం రెండు నిమిషాలు జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, అధికారులు, ప్రజాప్రతినిధులు మౌనం పాటించారు. జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జెడ్పీ సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. జెడ్పీ సీఈవో కె.నరేందర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు లేవనెత్తే అంశాలపై ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సమస్యలపై నిలదీత

స్థాయీ కమిటీ సమావేశాల్లో జెడ్పీటీసీ సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. లక్సెట్టిపేట జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య మాట్లాడుతూ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నాసిరకం రకం ఎరువులు, మందులు అమ్ముతున్నా వ్యవసాయ శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గత ఏడాదిగా రూ.160 కోట్ల పనులు చేపట్టినట్లు ఫారెస్టు అధికారులు చెబుతున్నా, అవి పేపర్ల పైనే ఉంటున్నాయని విమర్శించారు. వేమనపల్లి జెడ్పీటీసీ స్వర్ణలత మాట్లాడుతూ మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనానికి మరమ్మతులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు.

ఫిబ్రవరిలో పోడు భూముల పట్టాలు

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- వచ్చే నెల 6 వరకు పాసుపుస్తకాలు సిద్ధం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



పాల్గొన్న కలెక్టర్ భారతి హోళ్లికేరి, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: పోడు భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన గిరిజనులకు ఫిబ్రవరిలో పట్టాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర గిరిజన, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోడు భూములు, మన ఊరు–మన బడి, కంటి వెలుగు, ఉపాధ్యాయుల బదిలీలు తదితర అంశాలపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ అడవులను సంరక్షిస్తూనే చట్టాలకు లోబడి పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ఫిబ్రవరి 6 నాటికి పోడు భూముల పట్టాలు ప్రింటింగ్ పూర్తి చేసి పంపిణీ కోసం సన్నద్ధంగా ఉండాలని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరిగే విధంగా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు గ్రీవెన్స్ విభాగం, మెడికల్ బోర్డు, సదరం క్యాంపు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ భారతిహోళ్లికేరి, జిల్లా అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, బి.రాహుల్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, ట్రెయినీ కలెక్టర్ గౌతమి పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి అర్పిత మారంరెడ్డి

మంచిర్యాలక్రైం: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని స్థానిక అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి అన్నారు. మంచిర్యాల ఎస్ఆర్‌కే నర్సింగ్ కళాశాలలో సోమవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చాయని అన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు చైతన్యవంతులు కావాలని తెలిపారు. పోలీసుశాఖలో ప్రత్యేకంగా షీ టీమ్‌లు ఏర్పాటు చేశారని, మహిళల భద్రతకు సఖీ సెంటర్లు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తోళ్లవాగు సమీపంలో రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న అనాథ వయోవృద్ధుల, అనాథ పిల్లల ఆనంద నిలయం సందర్శించారు. వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకుని పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుగుణాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రావ్, పీపీ కిరణ్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు

కోటపల్లి: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో పోలీసులు సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్రాణహిత నదీ తీర ప్రాంతాలైన జనగామ, వెంచపల్లి, రాచర్ల గ్రామాలను ప్రత్యేక దళాలతో సందర్శించారు. ప్రాణహిత నదిలో చేపలు పట్టేవారిని, నదిలో బోటు యజమానులతో సీఐ మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు సరిహద్దుల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సంఘ విద్రోహ శక్తులకు ఆశ్రయం కల్పించినా, సహకరించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పడవలతో మహారాష్ట్ర నుంచి తెలంగాణ ప్రాంతాల్లోకి వస్తున్న వారి వివరాలను సేకరించారు. ఎస్సై వెంకట్, పోలీసులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడికి నిరసనగా ధర్నా



ధర్నా చేస్తున్న అర్చకులు, భక్తులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎంసీసీ సిమెంటు కంపెనీ యాజమాన్యం శివరామాలయం అర్చకులపై దాడి చేయడాన్ని నిరసిస్తూ అర్చకులు, కాలనీవాసులు సోమవారం కంపెనీ గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ యాజమాన్యం కంపెనీ ఆవరణలోని దేవాలయాలను ఆక్రమించుకోవాలని చూస్తోందని, విద్యుత్, నీటి సరఫరా నిలిపివేసి అర్చకులు, భక్తులు దేవాలయాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటోందని తెలిపారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు చందాలతో నిర్మించుకున్నామని, ఆలయాలపై యాజమాన్యానికి హక్కు లేదని అన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఆలయాలు భక్తులకు చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కౌన్సిలర్ జే.శ్రీలత, ఎంసీసీ కాలనీ వాసులు, అర్చకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ భారతి హోళ్లికేరి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తోందని, అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ భారతి హోళ్లికేరి అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 1991 నుంచి గ్రామ శివారులోని భూమిలో కాస్తుదారులుగా కొనసాగుతున్నానని, ఈ భూమిని వేరొకరికి పట్టా పాస్‌పుస్తకం జారీ చేశారని, తనకు న్యాయం చేయాలని జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన జునుగురి భారతి వినతిపత్రం అందజేసింది. తన భూమి కబ్జాకు యత్నిస్తూ వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని భీమారం మండల కేంద్రానికి చెందిన గాలిపెల్లి లత కోరింది. బెల్లంపల్లి మండలం శాంతిఖనికి చెందిన గాజుల రాజు, మారపాక లక్ష్మి పింఛన్ కోసం అర్జీ సమర్పించారు.

5,899 మందికి కంటి పరీక్షలు



కంటివెలుగు సిబ్బందికి సన్మానం

మంచిర్యాలటౌన్: జిల్లాలోని 40 శిబిరాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం 5,899 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. రీడింగ్ గ్లాసులు 1,382 మందికి, కంటి సమస్య ఉన్న వారిలో 1,100 మందిని గుర్తించి, వారికి కళ్లద్దాలు ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కాగా, మంచిర్యాల మున్సిపాలిటీలోని హమాలీవాడలో కంటి వెలుగు క్యాంపు సోమవారంతో ముగిసింది. కౌన్సిలర్ శ్రీరాముల సుజాత ఆధ్వర్యంలో డాక్టర్ రమేశ్, డాక్టర్ నిరుపమ, డేటా ఎంట్రీ ఆపరేటర్ సుజాత, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్ సురేఖలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ గౌరవ అధ్యక్షుడు మైలారం శ్రీనివాస్, కొత్తూరి సంతోష్, తిరుపతి, రాయమల్లు, ప్రసాద్, విష్ణు, తిరుపతి పాల్గొన్నారు.

గూడెంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



భజన చేస్తున్న కళాకారులు, ఆలయ సిబ్బంది

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవోపేతంగా ప్రారంభం అయ్యాయి. ఫిబ్రవరి 6 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు దేవతామూర్తుల చిత్రపటాలను గుట్టపై సప్తాహ భజన మండపం వరకు సన్నాయి వాయిద్యాలతో తీసుకెళ్లారు. అనంతరం నిరంతర సప్తాహ భజనలు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు రఘుస్వామి, సంపత్‌స్వామి, వేదపారాయణదారు నారాయణశర్మ, అర్చకులు, రెనొవేషన్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి పోరాటం



జెండా ఎగురవేస్తున్న అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్

భీమారం: రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడుతామని తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము ప్రేమ్‌సాగర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రైతు ఆత్మగౌరవ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదని అన్నారు. దిగుబడి వచ్చిన పంటను అమ్ముకునేందుకు సరైన మార్కెట్ లేదని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కట్కూరి ప్రకాశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పోటు తిరుపతిరెడ్డి, నరహరి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా బోనాల జాతర



బోనంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తురాలు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని లక్ష్మీదేవర ఆలయాల్లో సోమవారం బోనాల జాతర వైభవంగా సాగింది. బట్టిగూడెం, పాతబస్టాండ్ కాలనీల్లోని ముదిరాజ్‌లతోపాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారు జాము నుంచే అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఆలయ పూజారులు లక్ష్మీ, విష్ణుమూర్తి ప్రతిమలతో పట్నాల పైకి వచ్చారు. అనంతరం బోనాల జాతర ప్రారంభమైంది. శివసత్తుల పూనకాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మహిళలు బోనాలతో ఆలయ చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మవారికి సమర్పించారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కౌన్సిలర్లు, అర్చకులు గిరెల్లి మల్లయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి భూమి పూజ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామంలో రూ.65లక్షలతో వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కొలాంగూడ గిరిజనతండా వాసుల చిరకాల కోరిక నెరవేరుతోందని తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేసి రాబోయే వర్షాకాలం సమస్యలు తలెత్తకుండా అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, గ్రామ సర్పంచ్ పొట్టాల సుమలత, ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, రైతు బంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జాడి వెంకటేశ్, నాయకులు శ్రీనివాస్, జీవన్‌రావు, రఫీక్ పాల్గొన్నారు.

జంతువులపై ప్రేమగా వ్యవహరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జంతువులూ జీవించే స్వేచ్ఛ, హక్కు కలిగి ఉన్నాయని, వాటి పట్ల ప్రేమతో వ్యవహరించాలని కలెక్టర్ భారతి హోళ్లికేరి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ గౌతమి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు రమేష్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వీధి కుక్కలను చంపడం, తరలించడం, హింసించడం చట్టరీత్యా నేరమని తెలిపారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయా సంఘాల నేతలు సోమవారం డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు సక్రమంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.రామన్న, ప్రధాన కార్యదర్శి రాజావేణు, తపస్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఎస్‌టీ యూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి జయకృష్ణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వినతి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న సోనేరావు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో తమకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ గిరిజన పోరాట యోధుడు కుమురంభీం మనుమడు సోనేరావు సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశాడు. ఈ సందర్భంగా సోనేరావు మాట్లాడుతూ భీం వారసులమైన తమ రెండు కుటుంబాలకు 2014లో సీఎం కేసీఆర్ ఆర్‌సీ నం.ఈ1/3104/14 ద్వారా జిల్లా కేంద్రంలో ఇళ్లు నిర్మించి ఇస్తామని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఇప్పటి వరకు ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని, సీఎం హామీ నెరవేర్చాలని ఆయన కోరారు.

ఆర్టీసీ బస్సులో పొగలు



బస్సులోంచి వస్తున్న పొగ

తాండూర్(బెల్లంపల్లి): ఆర్టీసీ బస్సులోంచి ఒక్కసారిగా పొగ రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి బెల్లంపల్లి వైపు బయలుదేరిన ఆర్టీసీ బస్సు ఐబీ చౌరస్తా వద్దకు చేరుకోగానే బస్సు వెనుకభాగంలో నుంచి పొగలు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును ఆపడంతో ప్రయాణికులు కిందకు దిగారు. బస్సును పరిశీలించిన డ్రైవర్ లైనింగ్‌లు పట్టుకోవడంతో పొగలు వచ్చాయని, ప్రమాదం ఏమీ లేదని చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించారు.

దిండా.. జగమెరిగేలా..



వాగు వద్ద ఓ సన్నివేశం

1994లో గ్రామీణ పరిస్థితుల నేపథ్యం

1994 సంవత్సరంలో గ్రామీణ నేపథ్యం, అప్పటి ప్రజల కట్టుబాట్లు, దర్శకుడి చిన్నతనంలోని అనుభవాల ఆధారంగా చిత్రం రూపొందింది. ప్రేమ సన్నివేశాలు, భావోద్వేగాలు, సంస్కృతి, సంగీతం ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు పాలె తిరుపతి తెలిపారు. ఈ సినిమాలోని పలు సన్నివేశాల్లో బ్యాక్‌గ్రౌండ్‌లో నటించేందుకు దిండా గ్రామస్తులకు అవకాశం కల్పించారు. బతుకమ్మ పాటను గాయకురాలు మంగ్లీ ఆలపించారు. దగ్గుబాటి రాణా, సాయిపల్లవి నటించిన విరాట పర్వం చిత్రానికి సంగీత దర్శకత్వం వహించిన బొబ్బిలి సురేశ్ ఈచిత్రానికి సంగీత దర్శకత్వం వహించారు. హీరో రవితేజ మేనల్లుడు అవినాష్ వర్మ, ఆద్యరెడ్డిలను హీరో హీరోయిన్లుగా తొలిపరిచయం చేశామని, ప్రేక్షకులు ఆశీర్వదించాలని దర్శకుడు తిరుపతి కోరుతున్నారు.



హీరో అవినాష్‌కు సన్నివేశం వివరిస్తున్న దర్శకుడు తిరుపతి

- వెండితెరపై గ్రామీణ జీవన విధానం
- 1994లో జరిగిన ఘటనల ఆధారంగా సినిమా
- మారుమూల గ్రామాన్ని తెరకెక్కిస్తున్న యువ దర్శకుడు
- బ్యాక్‌గ్రౌండ్ నటీనటులుగా స్థానికులకు అవకాశం

చింతలమానెపల్లి(సిర్పూర్): సినిమా అంటే ఒక క్రేజ్.. ఇలాంటి ఓ సినిమా మన ప్రాంతంలో రూపు దిద్దుకుంటే ఆ ఆనందమే వేరు. మండలంలోని దిండా గ్రామ కేంద్రంగా రూపుదిద్దుకున్న చిత్రం.. జగమెరిగిన సత్యం. ఎలాంటి ప్రాచుర్యానికి నోచుకోని దిండా గ్రామం త్వరలో రంగస్థలానికి పరిచయం కాబోతోంది. ఆ గ్రామంలోని వెనుకబడిన పరిస్థితులు, గ్రామస్తుల సహజ అమాయకత్వం ఆసినిమాకు ఆయువుపట్టుగా మారాయి. చిత్రం 80 శాతం వరకు ఈగ్రామంలోనే రూపుదిద్దుకుంది. గ్రామ సమీపంలోని వాగు, రవీంద్రనగర్ వారసంత, గూడెం ప్రాణహిత నది వంతెన, పెంచికల్‌పేట్ పెద్దవాగు, కౌటాల మండల కేంద్రం, పక్కనే మహారాష్ట్రలోని అహేరి వద్ద కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు.

దర్శకుడు స్థానికుడే..

చిత్ర దర్శకుడు పాలె తిరుపతి స్వగ్రామం పెంచికల్‌పేట్ మండలంలోని చెడ్వాయి. చింతలమానెపల్లి మండలంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లివచ్చే క్రమంలో స్థానిక గ్రామాలపై ఉన్న పరిచయమే సినిమా చిత్రీకరణకు కారణమైంది. చెడ్వాయిలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన మంచిర్యాలలో డిగ్రీ వరకు చదువుకున్నారు. సినిమాలపై ఆసక్తితో చిత్రరంగానికి వెళ్లి దర్శకత్వ శాఖలో ఎనిమిదేళ్లు పనిచేశారు. ఈక్రమంలో కొరియన్ శీర్షికన అహేరి అనే లఘుచిత్రం రూపొందించారు. అది విజయం సాధించడంతో మరో నాలుగు లఘు చిత్రాలను రూపొందించారు. ఈ అనుభవంతో చిత్రాన్ని రూపొందించాలనే ఆలోచనతో జగమెరిగిన సత్యం చిత్రాన్ని తెరకెక్కించారు. తన చిన్నతనంలో తన తండ్రి పాలె ఆశన్న, పెదనాన్న బాపులు స్థానికంగా భజన కార్యక్రమాల్లో పాల్గొనేవారు. తండ్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడమే తనకు సినిమారంగంపై ఆసక్తిని పెంచిందని దర్శకుడు తెలిపారు. తన చిన్నతనంలో తండ్రి పాడిన ఒక పద్యాన్ని ఈ చిత్రంలోని ఓ సన్నివేశంలో చిత్రీకరించినట్లు వివరించారు.

పట్టుదలగా ప్రయత్నించాలి

ఎన్నో అవాంతరాలు వచ్చినా దర్శకుడు కావాలనే ప్రయత్నాన్ని నేను విరమించలేదు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎంతోమంది కళాకారులు ఉన్నారు. వారికి సరైన ప్రోత్సాహం లేదు. స్థానికంగా ప్రతిభ ఉండి అవకాశాల కోసం ఎదురు చూసే వారికి ప్రోత్సాహం ఇస్తా. కళాకారులు ప్రయత్నాలను విరమించవద్దు. పట్టుదలగా ప్రయత్నించాలి.

– పాలె తిరుపతి, దర్శకుడు



క్రీడారత్న అవార్డుకు ఎంపిక



రాజకొమురయ్య

రామకృష్ణాపూర్(చెన్నూర్): బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏటా అందజేస్తున్న క్రీడారత్న అవార్డుకు రామకృష్ణాపూర్‌కు చెందిన వెటరన్ క్రీడాకారుడు రాజకొమురయ్యను ఎంపిక చేసినట్లు అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారికి ఏటా అవార్డు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది పట్టణానికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు, సీనియర్ వెటరన్ క్రీడాకారుడు మడిపెల్లి రాజకొమురయ్య ఎంపికైనట్లు తెలిపారు. మార్చి 12న తిరుపతిలో అవార్డు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



లావణ్య

మంచిర్యాలటౌన్: అస్సాం రాష్ట్రంలోని గౌహతీలో ఫిబ్రవరి 2న నిర్వహించనున్న జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామానికి చెందిన లావణ్య ఎంపికైంది. డిసెంబర్ 28 నుంచి 31 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చింది. ఉమ్మడి జిల్లా నుంచి మహిళా విభాగంలో మొదటిసారిగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన లావణ్యను సోమవారం వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్ల శంకర్, కార్యదర్శి మైలారం శ్రీనివాస్, కోశాధికారి గాజుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బోరె యాదగిరి, బైరగోని సిద్దయ్య అభినందించారు.

నేడు జిల్లాస్థాయి పోటీలు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ, కేజీబీవీ, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో 8, 9 తరగతి చదివే విద్యార్థుల్లో భాషా పటిమను వెలికితీసేందుకు ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం (ఎల్టా) ఆధ్వర్యంలో ఈ నెల 31న జిల్లాస్థాయి విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు గైడ్ టీచర్‌తో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హాజరుకావాలన్నారు. ఇదివరకే పాఠశాల, మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన 80 మంది విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నృత్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాలక్రైం: హైదరాబాద్‌లోని కోంపల్లిలో ఉన్న అవని నృత్యాలయం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 28న నిర్వహించిన శివతాండవం నృత్య పోటీల్లో మంచిర్యాలకు చెందిన 11మంది కళాకారులు అత్యంత ప్రతిభ కనబర్చి వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నారు. మంచిర్యాల ఏసీసీ ప్రాంతానికి చెందిన నామని రవికుమార్ అవని నృత్యాలయం నిర్వాహకుడిగా కొనసాగుతున్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 80 మంది కళాకారులు పాల్గొన్నారు. మంచిర్యాల నర్తన రేఖ నాట్య కళాక్షేత్రం విద్యార్థులు సంజన, మహేశ్వరి, అక్షర, యోగితశ్రీ, సాయి హాసిని, కే.అక్షర, సాన్వి, పవనశ్రీ, అనుహ్య, సాయి అశ్రిత, సామ్యశ్రీ శివతాండవం నృత్యాన్ని 60 నిమిషాల పాటు ప్రదర్శించి ప్రతిభ కనబర్చారు. సదరు విద్యార్థులకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, భారత్ వరల్డ్ రికార్డ్ అధ్యక్షుడు లయన్ కేవీ రమణారావ్, డాక్టర్ నామని రవికుమార్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



నంది అవార్డులతో చిన్నారులు

మంచిర్యాల విద్యార్థులకు నంది అవార్డు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళానిలయంలో ఈ నెల 29న భారత్ ఆర్ట్ అకాడమీ ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంది పురస్కారాలు నిర్వహించారు. జతిస్వరం నృత్యానికి మంచిర్యాల నర్తన రేఖ నాట్య కళాక్షేత్రం విద్యార్థులు యోగితశ్రీ, సాయి హాసిని, పవనశ్రీ, అనుహ్య, సాయి అశ్రిత నంది అవార్డు అందుకున్నారు. సదరు విద్యార్థులను ఎల్ఎస్ లలితారావ్, డాక్టర్ ఎల్ఎస్ కే.వీ రమణారావ్ అభినందించారు.

'కాళేశ్వరం' ముంపు భూములు గుర్తించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో వందలాది ఎకరాల్లో పంటలు నీట మునుగుతున్నాయని, అధికారులు పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి ముంపు భూములను గుర్తించి పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ కోటపల్లి మండలం దేవులవాడ గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ల ఆధారంగా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పరిహారం అందేలా చూడాలన్నారు. ఏటా నీట మునిగి పంటలు నష్టపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోరల్ల మధు, సుదర్శన్‌రెడ్డి, పద్మ, రాంరెడ్డి, సత్తెమ్మ, కమలమ్మ, మల్లయ్య, లక్ష్మి, కిష్టయ్య, పోషం, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న దేవులవాడ గ్రామ రైతులు

ఎంసీసీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

అర్చకుడిపై దాడికి పాల్పడిన ఎంసీసీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏసీసీ కాలనీవాసులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. వార్డు కౌన్సిలర్ శ్రీలత, సదానందం, కాలనీ వాసులు మాట్లాడుతూ ఏసీసీ కార్మికుల జీతభత్యాల నుంచి జమచేసిన విరాళాలతో శివరామాలయం నిర్మించుకున్నారన్నారు. ఎంసీసీ యాజమాన్యం కాలనీ వాసులను గుడికి రాకుండా అడ్డుకుంటోందన్నారు. ఎంసీసీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పురుగుల మందుతాగి బాలుడు మృతి

భీమారం(చెన్నూర్): పురుగుల మందు తాగి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎలకేశ్వరం గ్రామానికి చెందిన బొమ్మెన సమ్మిరెడ్డి, మౌనిక దంపతుల కుమారుడు జస్వంత్ (6) పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడు. సోమవారం బాలుని తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత ఇంట్లోకి వచ్చి చూడగా పురుగుల మందు డబ్బా మూత తీసి ఉండడాన్ని గమనించారు. అనుమానం వచ్చిన దంపతులు వెంటనే తమ కుమారుడిని మంచిర్యాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు క్రిమిసంహారక మందు తాగినట్లు నిర్ధారించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యంకోసం కరీంనగర్‌కు తీసుకెళ్లాలని సూచించారు. కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: ఉరేసుకుని బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని అరుణక్క నగర్‌కు చెందిన దుబ్బ సుజాత-రవీందర్ దంపతుల కుమార్తె లక్ష్మీవంశిక(12) ఆరోతరగతి వరకు చదువుకుంది. ఆపై చదువులు ఇష్టంలేక ఇంట్లోనే ఉంటోంది. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మానస తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి

కాగజ్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన పెరుగు గణేశ్ (32) కౌటాల మండలంలోని గురుడుపేట గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంపై కాగజ్‌నగర్‌కు వచ్చిన గణేశ్ కౌటాలకు వెళ్తుండగా బాపునగర్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు సోమవారం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య రోహిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు

వాంకిడి(ఆసిఫాబాద్): జొన్నపంటకు కాపలా వెళ్లిన రైతుపై అడవిపంది దాడి చేసిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. చౌపన్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న పుల్లార గ్రామానికి చెందిన కుంరం మారుతి ఉదయాన్నే తన జొన్న పంటకు కాపలాగా వెళ్లాడు. కాపాలా కాస్తున్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన అడవిపంది అతని చాతిపై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

చింతలమానెపల్లి(సిర్పూర్): డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలోని బారెగూడలో ఆదివారం సాయంత్రం పిచ్చికుక్క దాడి చేయడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గుర్లె విలాస్ కుమారుడు కుమారస్వామి, బోర్లె వెంకటేశ్ కుమారుడు విఘ్నేష్ ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చి కుక్క దాడి చేసింది. చిన్నారులను 108లో కౌటాల పీహెచ్‌సీకి తరలించగా వైద్యుడు అందుబాటులో లేక పోవడంతో పాటు కుక్కకాటుకు మందు లేదని సిబ్బంది చెప్పారు. విఘ్నేష్‌కు టీటీ ఇంజక్షన్ వేసి ఇంటికి పంపించారు. వైద్యసిబ్బంది సూచన మేరకు కుమారస్వామిని సిర్పూర్ సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడకూడా కుక్కకాటు మందు లేక పోవడంతో మంచిర్యాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు బాలుడి తండ్రి తెలిపారు.

దరఖాస్తులకు గడువు పొడిగింపు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఫిబ్రవరి 1వరకు పొడిగించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలకు 217 దరఖాస్తులు ఇప్పటి వరకు విద్యాశాఖ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు.

అధికారులకు ప్రశంసాపత్రాలు

మంచిర్యాలటౌన్: ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అధికారులకు హైదరాబాద్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ, పునశ్చరణ కార్యక్రమాలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసపత్రాలు అందజేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ ప్రీతి మీనా చేతుల మీదుగా మంచిర్యాల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సూపర్‌వైజర్ వి.అనిల్ కుమార్ ప్రశంసపత్రం అందుకున్నారు.

ఐటీ మాఫీ చేయాలని నేడు ధర్నా

శ్రీరాంపూర్: కార్మికుల వేతనంలో అధిక శాతం ఆ దాయ పన్నుకే పోతోందని, మాఫీ చేయాలని డి మాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య తెలిపారు. సోమవారం ఆయ న ఎస్సార్పీ ఓసీపీపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. 11వ వేజ్‌బోర్డులో కార్మికులకు 19శా తం ఎంజీబీతో మెరుగైన వేతన ఒప్పందం సాధించామని, మిగతా అలవెన్స్‌లు, ప్రయోజనాలపై తదుపరి సమావేశాల్లో చర్చిస్తామని అన్నారు. కొత్త వేతన ఒప్పందం వల్ల మరింత పన్ను భారం పడనుందని, ప్రభుత్వ పన్ను మాఫీ చేయాలని, లేనిపక్షంలో రీయింబర్స్‌మెంటు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలో కార్మికులకు ఇన్సెంటివ్‌ల చెల్లింపులో తీవ్ర అన్యాయం జరుగుతోందని, దీన్ని సరిచేయాలని పేర్కొన్నారు. యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఎస్కే.బాజీసైదా, కే.వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఉపాధ్యక్షుడు ఆర్.చంద్రమోహన్, బ్రాంచీ సహాయ కార్యదర్శులు జీ.నర్సింగరావు, ఫిట్ సెక్రెటరీ మోహన్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన గిరిజనుల నుంచి 52 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను ఆయా విభాగాల అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని ఆదేశించారు. డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఏపీవో జనరల్ భీంరావ్, ఏవో రాంబాబు, ఈఈటీడబ్ల్యూ భీంరావ్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

- స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా డైగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటుకు రుణం మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం లింగోజీ తండాకు చెందిన రవికిరణ్ అర్జీ పెట్టుకున్నాడు. – కుటుంబ పోషణ, స్వయం ఉపాధి కోసం వాహనం కొనుగోలుకు రుణం అందించాలని వట్టివాగుకు చెందిన వినోద్‌కుమార్ వేడుకున్నాడు.
- తమ వ్యవసాయ చేనులో బోరుబావితోపాటు విద్యుత్ సౌకర్యం కల్పించేలా రుణం అందించాలని ఇంద్రవెల్లి మండలం అంజికి చెందిన శశికళ విన్నవించింది.
- తనకు ఆసరా పింఛన్ ఇప్పించాలని ఉట్నూర్ మండలం రాంజీగోండ్‌నగర్‌కు సోయం సుభాష్ అర్జీ పెట్టుకున్నాడు.
- తనకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంద్రవెల్లి మండలం ఈశ్వర్‌నగర్‌కు చెందిన ఆర్.నిరంజన్ విన్నవించాడు.



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వరుణ్‌రెడ్డి

బొగ్గు ఉత్పత్తిలో ఆదర్శం 'ఆర్కే 6'

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గు ఉత్పత్తిలో ఆర్కే 6 గని అన్ని భూగర్భ గనులకు ఆదర్శంగా నిలిచిందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఆర్కే 6 గనిపై సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం మాట్లాడుతూ గనికి నిర్దేశించిన వార్షిక లక్ష్యం 1.8 లక్షల టన్నులనుగానూ ఈ నెల 28 నాటికే సాధించారన్నారు. 63 రోజులకు ముందే వార్షిక లక్ష్యం సాధించి కంపెనీలో రికార్డు సృష్టించిందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం తలసేమియాతో బాధపడుతున్న చిన్నారి గౌషి యా వైద్యచికిత్సల కోసం గని ఉద్యోగులంతా కలి సి సేకరించిన విరాళం రూ.50,010 బాధిత కు టుంబానికి అందించి ఔదార్యం చాటుకున్నారు.

ఏఎస్ఓకు సన్మానం..

శ్రీరాంపూర్ ఏరియా సేఫ్టీ అధికారిగా పనిచేసిన గోషిక మల్లేశ్ నేడు ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా ఆయనను జీఎంతో పాటు గ్రూపు ఏజెంట్ ఏవీ రెడ్డి, మేనేజర్ తిరుపతి శాలువాతో సత్కరించారు. టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, సేఫ్టీ అధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి ఆర్.రాంనర్సయ్య, అధికారులు కొమురయ్య, అందె శ్యాంకుమార్, మహేశ్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



ఏఎస్ఓ మల్లేశ్‌ను సన్మానిస్తున్న జీఎం

వేంపల్లికి ఇసుక రీచ్?

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని గోదావరికి ఇసుక రీచ్‌ను కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల గనులు, భూగర్భ శాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఇసుక రీచ్ నిర్వహణపై సర్వే నిర్వహించారు. ఈ మేరకు వేంపల్లి గోదావరి నుంచి ఇసుక రవాణా చేసుకునేందుకు అధికారికంగా ఇసుక రీచ్ ఏర్పాటుపై స్పష్టమైన నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిసింది.